

# యవనిక

గొరుసు జగదీశ్వరరెడ్డి

స్టేషన్లో రైలు ఆగేసరికి ఇంకా చీకటిగానే ఉంది. నక్షత్రాలు కొన్ని అక్కడక్కడా మిణుకుమిణుకుమంటున్నాయి. ధనుర్మాసం చలి వణికిస్తోంది. కప్పుకున్న శాలువాని మరింతగా బిగదీసుకున్నాను.

చేతిలోని ఎయిర్ బ్యాగ్‌తో నిల్చుని చుట్టూ చూశాను. కాస్త దూరంలో రావిచెట్టు చుట్టూ కట్టిన సిమెంట్ చప్టా కనిపించింది. వెళ్లి కూర్చున్నాను. ఆకు రాలు కాలం వల్ల పక్కనున్న తురాయిచెట్టు ఆకులు గాలి వీచినప్పుడల్లా తుంపరలా రాలుతున్నాయి. కీచు రాళ్ల రొద స్పష్టంగా వినిపిస్తోంది.

అదొక చిన్న రైల్వేస్టేషన్. పాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతాయనుకుంటా. స్టేషన్‌లో ఆ కొస నుండి ఈ కొస వరకు నేను తప్పించి మరొకరు లేరు. నా కళ్లు రైల్వే స్టేషన్ నుండి బయటికి వెళ్లే ద్వారంవైపే చూస్తున్నాయి దేవదానంకోసం. రైల్వేకాంటీన్‌లో ఏవో గిన్నెల చప్పుళ్లు వినిపిస్తున్నాయి. గేటు దగ్గర కూడా ఎవరూ లేరు. స్టేషన్ బయట ఆగి వున్న గుర్రపుబగ్గీని తోలేవాడు స్టేషన్‌లోకి వచ్చి, 'ఊళ్లోకి వచ్చేవాళ్లు ఎవరైనా ఉన్నారా,' అన్నట్లు చూసి కాంటీన్ దగ్గరకు వెళ్లాడు.

రాత్రి ప్రయాణమంతా మెలకువతోనే ఉన్నాను. మెదడులోని ఆలోచనలు నిద్రను దరి చేరనివ్వలేదు. ఇంత వేగంగా నిర్ణయం తీసుకుని ఇల్లు వదిలి వచ్చేస్తానని అనుకోలేదు. అంత తెగింపు నాలో కల్గుతుందనే ఊహించలేదు. నా చిట్టితండ్రి అభినయ్ స్కూలు నుండి రాగానే నాకోసం ఇల్లంతా గాలిస్తాడు కాబోలు. 'నానమ్మ ఎక్కడికెళ్లింద'ని వాళ్లమ్మను అడుగుతాడు. ఖచ్చితంగా వనజ విసుక్కుంటుంది. ఆ సన్నివేశం గుర్తు చేసుకుంటేనే దుఃఖం ఎగదన్నుకొస్తోంది.

అభినయ్‌ని నా గుండెలకు హత్తుకుని తనివితీరా ముద్దాడి, 'ఇక నానమ్మ కనిపించదు కన్నా, బుద్ధిగా చదువుకో,' అని వీడ్కోలు చెప్పాల్సింది.

ఎంత మర్చిపోదామన్నా వనజ మాటలు చెవుల్లో గింగుర్లెత్తుతూనే ఉన్నాయింకా. నా గుండెలో చిచ్చు పెట్టినట్టుగా ఉంది. ఇంతకూ నేను చేసిన నేరం ఏమిటి? ఎందుకంత లేసి మాటలంది? నన్ను ఇంట్లోంచి వెళ్లిపొమ్మని ఎలా అనగలిగింది?

వ్యక్తిగతంగా తిట్టినా భరించేదాన్నే... కానీ నాలోని కళని ఎంత నీచంగా అంచనా వేసింది. శివ ఆ మాట లకు వంత పాడటం మరింత గుండెకోతగా ఉంది.

ఎలా పెంచి పెద్దచేశాను వాణ్ణి. వాడికోసం నా జీవితాన్నే పణంగా పెట్టాను. నా ఆశలు, కోరికలు చంపుకుని బతికాను. నేనెన్ని అవమానాల పాలయినా వాడికి ఏ లోటూ రానీయలేదు. అసలు వాడికి తనెలా పెరిగాడో గుర్తుందో, లేదో?

ఆలోచనలతో నరాలు చిట్లిపోతాయనిపిస్తోంది. మెదడులోని జ్ఞాపకాల గనులు మెల్లమెల్లగా పగుళ్లీన సాగాయి.

*

అడుగడుక్కీ ప్రేక్షకుల నీరాజనాలు అందుకుంటూ... ఒకప్పుడు ఎలా బతికాను?

రంగస్థలంపై నేను కన్పించగానే హాలంతా చప్పట్లతో మారుమ్రోగిపోయేది.

ఎన్ని నాటకాలు? ఎన్ని ప్రశంసలు?

రంగస్థలమే జీవితంగా, ప్రేక్షకుల స్పందనే ఊపిరిగా బతికాను. ఎన్ని ఒడిదుడుకులెదురైనా చలించలేదు. 'నాటకాలు మనుషుల్లో ఎంతో కొంత మార్పు తెస్తాయని,' చెబుతూ, 'ఈ కళ మనకు దేవుడిచ్చిన వరం. దీన్ని పదిమందికీ పంచిపెడదాం,' అనేవాడు నాన్న. ఆయన నాటకాల కంపెనీని నడిపేవాడు. అతని కింద ఎందరో జీవిక సాగించేవారు. నాటకాలకు సంబంధించిన హార్మోనిస్టులు, తబలావాళ్లు, మృదంగం వాయించేవాళ్లు, ఆహార్యానికి వస్తువులు తయారుచేసేవాళ్లు, సన్నివేశానికి తగ్గట్టు తెరలందించేవాళ్లు, లైట్లను అమర్చేవారు... నటీనటులు సరేసరి.

నాన్న నాటకాల కంపెనీ గ్రూపులోనే మాధవుడు ఉండేవాడు. నాకు యుక్తవయసు వచ్చేసరికి మాధవుడు మంచి పేరు సంపాదించుకున్నాడు.

మాధవుడు అందగాడే కాదు గొప్ప గుణవంతుడు. నాకు తెలీకుండానే అతనిపై మనసు పెంచుకున్నాను. అతను నటిస్తుంటే గొప్ప అనుభూతితో పరవశించిపోయేదాన్ని. అతని పక్కన జోడీగా నటించాలని ఉండేది. నా ఆలోచనలు మరింత బలపడి నా మనసులోని మాట నాన్న ముందుంచాను.

"అప్పుడప్పుడు ఏవో వేషాలేశావంటే అప్పుడు చిన్నపిల్లవి. పెద్దదానివయ్యావు. ఎందుకమ్మా నీకీ నాటకాలు? నీకు పెళ్లి చేసి ఒక అయ్య చేతిలో పెట్టాల్సిన బాధ్యత నాపై ఉంది," అన్నాడు.

నిజానికి నాన్న నా మాట ఎప్పుడూ కాదనడు. మారాం చేశాను.

మాధవుడికి సమవుజ్జీగా నటించాలని పట్టుబట్టి ఒప్పించాను.

నా అంతరంగంలోని నటి ప్రాణం పోసుకుంది. నేను నటించనున్నట్లు తెలిసిన మాధవుడు మొదట్లో ఆశ్చర్యపోయాడు. తర్వాత తనే తర్ఫీదు ఇచ్చేవాడు. మేమిద్దరం తొలిసారిగా వేసిన నాటకం హరిశ్చంద్రే.

*ఇచ్చోటనే భూములేలు*
*రాజన్యులధికార ముద్రికలంతరించె*
*ఇచ్చోటనే ఏ సత్కవీంద్రుని కమ్మని*
*కలము నిప్పులలలోన కరిగిపోయె...*

హరిశ్చంద్రుని వేషంలో మాధువుడు జాషువా పద్యాన్ని ఎత్తుకోగానే ప్రేక్షకుల ఈలలు, చప్పట్లు మిన్నంటేవి. కాటిసీనులో నటిస్తే ఆడవాళ్లు కళ్లొత్తుకుని కొంగుల్ని తడుపుకునేవారు.

ప్రతి దృశ్యం పండేది. ప్రతి ఘట్టానికి ప్రేక్షకుల నీరాజనాలు.

విజయనగరం నుండి నెల్లూరు దాకా తిరిగేవాళ్లం. ఇతర రాష్ట్రాల్లో కూడా అప్పుడప్పుడు తెలుగువాళ్ల కోసం నాటకాలు ఆడేవాళ్లం. నాన్న నడిపే ప్రేమజ్యోతి నాటక కళాసమితికి ప్రజల్లో పెద్ద పేరుండేది.

నాన్నకు అప్పటికే పెద్ద వయసు. అనుకోకుండా పెద్ద జబ్బు చేసింది. తను నడిపే నాటక సమాజం ఎప్పుడూ బతికి ఉండాలన్నదే అతని కోరిక. దీన్ని సవ్యంగా నడపడం మాధవుడికే సాధ్యమని నాన్నకి తెలుసు.

"మాధవా... నేనెన్నాళ్లో బతుకుతానని అనుకోను. నా తర్వాత ఈ నాటక సమాజాన్ని నడిపే బాధ్యతని నువ్వే చేపట్టాలి. వసుంధర తల్లి లేని పిల్ల. తల్లీతండ్రీ నేనై పెంచాను ఇన్నాళ్లు. వసుంధర బాధ్యత కూడా నీవే తీసుకోవాలి," ఒకరోజు మాధవుడితో అన్నాడు నాన్న.

నాన్నకు అభయమిచ్చాడు మాధవుడు. తనే అంతా చూసుకుంటానని మాట ఇచ్చాడు. ఆ తర్వాత కొంతకాలానికే నాన్న సంతోషంగా మాధవుడి చేతిలోనే ప్రాణాలు వదిలాడు.

నా చిన్నతనంలోనే అమ్మ చనిపోయినా మరో పెళ్లి చేసుకోకుండా నన్ను ఎంతో గారాబంగా పెంచిన నాన్న పోవడాన్ని తట్టుకోలేకపోయాను. ఆ గాయం మానడానికి కొంతకాలం పట్టింది.

కాలం గడుస్తోంది.

మాధవుడితో నాటకాలు వేస్తున్నాను... తెలియని ఊళ్లల్లో ప్రేక్షకులంతా మమ్మల్ని భార్యాభర్తలుగా భావించేవాళ్లు.

ఎన్నో నాటకాల్లో మేమిద్దరం జంటగా నటించాం. పౌరాణికాలతో పాటు సాంఘిక నాటకాలు కూడా. హరిశ్చంద్ర మొదలుకొని సారంగధర, ద్రౌపదీ వస్త్రాపహరణం... వరూధిని లాంటివి ఎన్నని!

అతను విప్రనారాయణుడైతే నేను దేవదేవిని.
అతను బిల్వమంగళుడైతే నేను చింతామణిని.
అతను గిరీశమయితే నేను మధురవాణిని.
అతను కృష్ణుడయితే నేను సత్యభామని.

ఒక్కటా రెండా ఎన్ని నాటకాలు? మాధవుడితో పోటీపడి నటించేదాన్ని. మాధవుడిపై నేను చూపించే శ్రద్ధని, నా మనసులోని కోరికను దేవదానం తెలుసుకోగలిగాడు. దేవదానం మా నాటకసంస్థలో హార్మోనిస్టయినా మాధవుడికి చేదోడుగా ఉండి నటన పట్ల కూడా శ్రద్ధ చూపేవాడు. అతని భార్య రాగమయి కూడా మా నాటకాల్లో నటించేది.

మాధవుడ్ని పెళ్లి చేసుకోవడానికి నా ఇష్టం అవసరం లేదని గ్రహించాక, మాధవుడితో ఈ విషయాన్ని కదిపి చూశాడు దేవదానం.

''జానకిరామయ్యగారు నాటకాలతో పాటు వసుంధరనీ నాకు అప్పగించారు. కాని ఊరూరా తిరిగి నాటకాల్ని వేసే నాలాంటివాణ్ణి కట్టుకొని వసుంధర సుఖపడలేదు. మంచి సంబంధం చూసి పెళ్లి చేద్దాం.''

మాధవుడి నోటి నుండి వచ్చిన ఆ మాటలకు నీరుగారిపోయాను. మాధవునికి నా మనసులోని మాటని ఎలా చెప్పాలో తెలీలేదు. నాలో తిష్టవేసిన మూర్తి తనే అని ఎలా చెప్పేది?

చివరికి దేవదానమే మాధవుడితో, 'నేను అతని కోసమే బతుకుతున్నాన'ని చెప్పి ఒప్పించాడు.

ప్రేక్షకులందరి సమక్షంలో రంగస్థలంపైనే మా పెళ్లి జరిపించాడు దేవదానం.

నా కలలు ఫలించిన రోజది. నేను కోరుకున్న మాధవుడు నాకు దొరికాడు. మాధవుడు నా జీవితానికో కవచం. అతని నీడలో తెలీకుండానే కాలం కరిగిపోయేది. అతనితో నడక పూలబాటే. పెళ్లయిన సంవత్సరానికే శివ కడుపులో పడ్డాడు.

దేవదానం, రాగమయిలు నాకు అన్నావదినల్లా అనిపించేవాళ్లు. మా ట్రూపులో ఎక్కువ బాధ్యతని తీసుకునేవాళ్లు. ఏరోజు ఎక్కడ, ఏ నాటకం ఆడాలో... సమయానికి గుర్తు చేసే బాధ్యత కూడా దేవదానందే.

నాటకాల ట్రూపులో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకోవడానికి ముందుండే వాడు మాధవుడు. తీరిక లేని జీవితం తనది. రంగస్థలంపై వేసే కర్టెన్ల నుండి వాయిద్య కళాకారులను, పాత్రల ఆహార్యాలను, స్క్రిప్ట్, రిహార్సల్స్‌ని... ప్రతి విషయంలో తనే దగ్గరుండి చూసుకునేవాడు.

శివ పుట్టాక వాడిని చూసుకుంటూనే నాటకాల్లో పాల్గొనేదాన్ని. చిన్నపిల్లాడిని నాటకాల కోసం ప్రతి ఊరూ తిప్పాల్సి రావడం ఇబ్బంది అవుతోందని నన్ను నాటకాలు మానేయమన్నాడు మాధవుడు. కాని నేను తోడు లేకపోతే తనకెంత ఇబ్బందో నాకు తెలుసు. అందుకే నవ్వి ఊరుకునేదాన్ని.

సముద్రంలో వచ్చే తుఫానుల్ని ముందుగానే కనుగొని హెచ్చరికలైనా ఇస్తారు. నా జీవితంలో సంభవించిన తుఫానుకు అవేవీ లేవు. ఆరోజు రాజమండ్రిలో సావిత్రి నాటకం వేస్తున్నాం. నేను సావిత్రి వేషంలో యముణ్ని వేడుకుంటున్న సన్నివేశం. నిర్జీవావస్థలో రంగస్థలంపై మాధవుడు. ప్రేక్షకులు ఊపిరిబిగబట్టి చూస్తున్నారు.

కాకతాళీయమనాలో దైవ నిర్ణయం అనాలో తెలీదు. ఒక్కసారిగా మాధవుడిలో కదలిక. 'అమ్మా,' అంటూ లేచి కూర్చున్నాడు. రంగస్థలంపైనే ఉప్పెనలా వచ్చిన గుండెపోటుతో ఎగిసెగసి పడుతున్నాడు. చనిపోయినట్లు నటించాల్సిన సత్యవంతుడి వేషంలోని మాధవుడు అలా వంకర్లు పోవడంతో కూర్చున్న ప్రేక్షకులు కంగారుగా లేచి నిలబడిపోయారు.

'ఏమయిందేమయిందంటూ...' రంగస్థలం పైకి వచ్చేశారు. నేను మ్రాన్పడిపోయి ఉండిపోయాను. అందరం చూస్తుండగానే నా ఒళ్లోనే మాధవుడు చివరి శ్వాస వదిలాడు.

నా చుట్టూ చీకట్లు కమ్ముకున్నాయి. నేనేం పాపం చేశానని నాకీ శాపం! కన్న తండ్రిని, కట్టుకున్నవాడిని పోగొట్టుకున్నాను. పసికందు శివతో... గమ్యం తెలీలేదు.

చాలారోజులు నాటకాలు ఆడటం మానేశాం. ఒకరకంగా ప్రేమజ్యోతి నాటక కళాసమితి మూతపడినట్టే అనుకున్నారు. మా ట్రూపులో పనిచేసేవారు ఇతర నాటక సమాజాల్ని వెతుక్కుంటూ వెళ్లారు. దాదాపు సంవత్సరం పాటు మాధవుడి మరణంతో మూగబోయాను.

నన్ను వెన్నంటే ఉండేవాడు దేవదానం. ఎప్పుడూ నేను సంతోషంగా ఉండాలనేవాడు. విచారంగా వున్నట్టు కన్పిస్తే ఏదోలా నవ్వించేందుకు ప్రయత్నించేవాడు. ఒకరోజు తన మనసులోని మాట నా ముందుకు తెచ్చాడు.

''వసుంధరా, శివను పెంచి పెద్ద చేయటానికైనా నీవు ముఖానికి రంగు వేసుకోక తప్పదు. మరీ అంత బేలవైతే ఎలా? జీవితం గురించి నీకు చెప్పాల్సినవాణ్ణా? మనం రంగస్థలంపై గంటసేపు ఆడే ఆటే ఇది. మనకే తెలిసిన జీవితసత్యం ఇది. పోయినవాళ్లతో పాటు పోతామా? నా మాట విను. నేను నీకు తోడుగా వుంటాను. ఇంకా మన ట్రూపులోని కొందరు ఎటూ వెళ్లకుండా మనల్నే నమ్ముకుని ఉన్నారు. నీవు ఈ పగ్గాలు పట్టుకోవలసిందే...'' దేవదానం నన్ను రకరకాలుగా ఒప్పించి మళ్లీ నేను రంగస్థలం ఎక్కేలా చేశాడు.

మళ్లీ మా నాటక ప్రస్థానం మొదలయింది. పాలు తాగే శివను వెంటేసుకుని ఊరూరా నాటకాలు వేయడం మొదలెట్టాను. జాలిగొలిపిన కళ్లకే నా యౌవనం అడవి కాచిన వెన్నెల్లా కనిపించేది. ఎన్ని

కళ్లను తప్పించుకున్నానో, ఎన్ని చూపుల వలల్ని ఛేదించానో.

మగతోడు లేని జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో తెలిసిందప్పుడే. మనుషుల మాటల వెన కున్న వెకిలితనం తెలుసుకోలేని అమాయకురాల్ని కాను. మేకవన్నె పులులను చూసిన సందర్భాలూ ఉన్నాయి.

కాకినాడలో విప్రనారాయణ నాటకాన్ని ప్రదర్శిం చాల్సి వచ్చిందొకసారి. నాటకంలో నేను దేవదేవిని. కాకినాడ దగ్గర్లోని ఒక ఊరి మునసబు నాటకం చూడ్డానికి వచ్చి, 'నాటకం తనకెంతో నచ్చిందని వాళ్ల ఊర్లో ప్రదర్శించాల'ని పట్టుబట్టి మరీ మా ట్రూపుని ఆహ్వానించాడు. రెండ్రోజులు వరసగా ప్రదర్శించాం. ఆ చుట్టుప్రక్కల గ్రామాల నుండి కూడా జనం వచ్చారు.

నాటక ప్రదర్శన అయిన రెండో రోజు రాత్రి మా విడిది దగ్గరికి ఓ ఆడమనిషిని రాయబారిగా పంపాడు మునసబు. నన్ను చాటుకు రహస్యంగా పిలిచిందావిడ.

'మునసబు నా అందానికి ముగ్ధుడయ్యాడని, తనకు పెళ్లాం పిల్లలున్నా నన్ను ఉంపుడుగత్తెగా ఏలు కుంటాడని, తోటలోని బంగళాలో నన్నుంచి రాణీలా చూసుకుంటాడనీ...' వర్తమానం మోసుకొచ్చింది.

భయంతో నాకు కాళ్లూ చేతులాడలేదు. కోపంతో ఊగిపోయాను. నోట్లోంచి మాట పెగల్లేదు. ఆమె మాటల్ని ఎప్పుడు విన్నాడో ఎలా విన్నాడో దేవదానం వచ్చాడక్కడికి. నన్ను లోపలికి వెళ్లమని, వచ్చినావిడతో చాలా తీవ్రస్థాయిలోనే వాదనకు దిగాడు. గొడవ పెద్ద దవడంతో చాలామంది గుమిగూడారు. ఆ రభసలో మెల్లగా జారుకుందామె. కాని మరో అరగంటలో కొందరి ఊరివాళ్లతో పాటు మునసబుని కూడా తీసు కొచ్చింది.

వాళ్లంతా రావడం రావడంతోనే పెద్దగా అరుస్తూ దేవదానంపై కలబడ్డారు. మునసబు కోపంతో బుసలు కొట్టాడు.

"మీకు సదుపాయాలు సరిగ్గా ఉన్నాయో లేవో కనుక్కురమ్మని పంపిస్తే ఒళ్లు కొవ్వెక్కి దాని చెయ్యి చ్చుకుంటావా," అంటూ దేవదానం డొక్కలో తన్ని, "నాటకాల్లో సానేషాలు వేసుకుని బతికే మీకింత పొగరా," అన్నాడు నావైపు అదోలా చూస్తూ.

అనుకోని ఆ సంఘటనకి అంతా నోరెళ్లబెట్టాం.

మా ట్రూపంతా ఏడుస్తూ వాళ్ల కాళ్లావేళ్లా పడ్డాక దయతలచినట్టు... "తెల్లవారేసరికి ఊరిని వదిలేయక పోతే మా చేతుల్లో చావు తప్పదంటూ..." మునసబు హూంకరిస్తూ వెళ్లాడు.

మా ఆక్రందన అరణ్యరోదనే. వారిది స్థానబలం. ఎవరికి చెప్పుకోవాలి?

నా పైని కోపంతో చేయని నేరాన్ని దేవదానానికి అంటగట్టి కక్ష తీర్చుకున్నాడు. మేం చేసిన తప్పేంటో అర్థం కాలేదు. ఊరూరా తిరుగుతూ నాటకాలు వేసుకు బతికే మాపైనా ఇంత జులుం.

మొట్టమొదటి మేకవన్నెపులిని మునసబు రూపంలో చూసిందక్కడే.

దేవదేవిగా నటించాను గనక వాడి దృష్టిలో నేను దేవదాసినయ్యాను.

ఆ పాత్ర ఔన్నత్యం ముందు వాడు మరు గుజ్జులా కన్పించాడు.

కాకినాడకి ఆరు మైళ్ల దూరంలో ఉందా ఊరు. దిక్కుతోచని స్థితి. అంత అర్ధరాత్రివేళ ఎడ్లబళ్లను కట్టే వాళ్లు ఎవరూ లేరు. కొందరు మునసబుకి వ్యతిరేకించి బండి కట్టమన్నారు. మా ట్రూపులో కనీసం ఇరవై మందిమి ఉంటాం. మాతోపాటు నాటకానికి సంబం ధించిన ఎన్నో వస్తువులు... ఒకవైపు దెబ్బలవల్ల సరిగ్గా నడవలేని దేవదానం.

తప్పని పరిస్థితి. కాలినడకన మా సామానుతో పాటు కాకినాడకి పయనమయ్యాం. శివని చంకలో వేసుకున్నాను. సన్నని వెన్నెల దారిలో పొలాలగట్ల వెంట పడుతూ లేస్తూ... దేవదానాన్ని నడిపిస్తూ... బతుకు జీవుడా! అనుకుంటూ కాకినాడ చేరుకున్నాం అందరం.

కాకినాడ పోలీసుస్టేషన్లో మునసబుపై కేసు నమోదు చేద్దామన్నాడు దేవదానం. నేనే వద్దన్నాను. జరిగింది ఎలాగూ జరిగిపోయింది. పలుకుబడి, డబ్బు న్యాయానికి ఎటు పక్కనుంటాయో తెలుసు కనక.

కొంతకాలం వరకు ఆ సంఘటన ఎప్పుడు గుర్తొచ్చినా గుండె వణికేది.

దేవదానం చాలారోజుల వరకూ కోలుకోలేక పోయాడు. దెబ్బలు మానడానికి చాలా రోజులే పట్టింది.

ఆ తర్వాత మనుషుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండేదాన్ని.

శివ పెద్దయ్యేకొద్దీ ఆర్థికంగా కూడా ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వచ్చేది. తప్పని పరిస్థితుల్లో మా ట్రూపు లోనే కాక ఇతర నాటక కంపెనీల్లో కూడా నటించేదాన్ని. శివ స్కూల్‌ఫీజులకు, పుస్తకాలకు కూడా సంపాదించాలి.

మరోసారి విశ్వకళా నాటక సమాజంవారికి కన్యా శుల్కంలో మధురవాణిగా వేయడానికి బందరు

వెళ్లాను. చదువు చెడిపోతుందని శివని ఎక్కడికీ తీసుకెళ్లే దాన్ని కాను. ఇలాంటప్పుడు రాగమయిని ఇంటి దగ్గరే ఉంచి, వాడిని అప్పగించేదాన్ని.

నాటకం అయిపోగానే పెద్దల ప్రశంసలు. ఎవరో సినీరంగ ప్రముఖులు కూడా వచ్చినట్టున్నారు. సినిమాల్లో నటిస్తావా అని దేవదానంతో అడిగించారు. ఎంత బలవంతం చేసినా ససేమిరా అన్నాను. 'నేను ఇప్పటికే శివని సరిగా చూడలేకపోతున్నానని, సినీ రంగానికి వెళ్తే వాడికి మరింత దూరం అవుతాన'ని చెప్పాను.

శివలో మాధవుడ్ని చూసుకొని తృప్తి చెందేదాన్ని. వాడికి నాటకరంగం నచ్చలేదు. అప్పుడప్పుడు చిన్ని కృష్ణుడి వేషం వేయమన్నా ఒప్పుకునేవాడు కాదు. ఎక్కువగా చదువు పైనే శ్రద్ధ పెట్టేవాడు.

*

ఏదో గూడ్సుబండి రొద చేస్తూ వెళ్లిన శబ్దానికి ఉలిక్కిపడుతూ కళ్లు తెరిచాను. గమనించనే లేదు. లోకం నిద్ర లేచినట్టుంది. అక్కడక్కడున్న సిమెంట్ బెంచీలపై జనం కూర్చుని ఉన్నారు. టీ స్టాల్ దగ్గర ఒకరిద్దరు నిల్చుని ఉన్నారు. పాసింజర్ రైలేదో వస్తున్నట్టుగా గంటలు కొట్టారు. రాత్రివేళ రావి ఆకులపై ఘనీభవించిన మంచు, సూర్యరశ్మితో కరిగి ముత్యాల్లా రాలుతోంది నాపై.

మరోసారి గేటుకేసి చూశాను, దేవదానం కోసం. తను మరవకుండా వస్తాడని నాకు గట్టి నమ్మకం.

రకరకాల ఆలోచనలు... లేచి కాంటీన్ వైపు నడిచాను. టీ తాగాక కొంత హాయిగా ఉంది. అభినయ్‌ని వదిలి రాలేకపోయాను. వాణ్ణి వదిలి రావాలంటే మనసెంత నరకం అనుభవించిందో! అయినా తప్పలేదు.

ఎంత ముద్దొస్తాడు వాడు. అచ్చంగా తాత పోలికే. మాధవుడి నోట్లోంచి ఊడిపడ్డట్టుగా ఉంటాడు. తాత పోలికలే కాదు, తాతలోని నటనని కూడా పుణికి పుచ్చుకున్నాడు.

శివలో కన్పించని కళాకారుడు అభినయ్‌లో కన్పించాడు నాకు. రెండేళ్లప్పటి నుండే చెప్పింది అనుకరించి చూపించేవాడు. ఏకసంథాగ్రాహి. నేను కోల్పోయిందేదో వాడిలో దొరికినట్లు అనిపించేది.

శివ ఇప్పుడు ఇంత ప్రయోజకుడై మంచి ఉద్యోగస్తుడయ్యాడంటే అందుకు కారణం రంగస్థలమే. తనతోపాటే ఉద్యోగం చేసే వనజని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని అన్నప్పుడు నేను ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. వాడి ఇష్టం ఎప్పుడూ కాదనలేదు.

అభినయ్‌కి వాళ్ల అమ్మానాన్నలతో కన్నా నాతోనే చనువెక్కువ. స్కూల్ నుండి ఇంటికి వచ్చేసరికి నేనే కనబడేదాన్ని. వాడిలోని కళాకారుడ్ని వెలికి తీసే ప్రయత్నంలోనే వాడికి నాటకాల్లోని సంభాషణల్ని, పద్యాల్ని, కొన్ని ఏకపాత్రాభినయాల్ని చెప్పేదాన్ని.

నేనే ఆశ్చర్యపోయేలా అభినయించేవాడు. వాడిది చక్కని స్వరం. పద్యం  పాడితే వినసొంపుగా ఉండేది. వాడితో గడిపే ప్రతి క్షణం నాకో అమృత ఘడియే. వాడి నటనలో, పాటలో నన్ను నేను మైమరచిపోయేదాన్ని.

అభినయ్‌తో నేను ఎక్కువసేపు గడపడం వనజకి అంత ఇష్టం ఉండేది కాదు. వాడిని గారాం చేస్తున్నానని విసుక్కునేది. ఒకటి రెండుసార్లు మందలించింది కొడుకుని.

తల్లి దగ్గర చాలా బుద్ధిమంతుడిలా చదువుకుంటున్నట్టే అభినయించేవాడు. నా దగ్గర మాత్రం వాడిలోని కళాకారుడు విశ్వరూపం ప్రదర్శించేవాడు.

నిన్న ఉదయం అభినయ్ ప్రొగ్రెస్ కార్డుని చూసి, వనజ చేసిన రాద్ధాంతం గుర్తుకొస్తే గుండెలో వణుకు పుడుతోంది. ఇల్లు ఎగిరిపోయేలా అరిచింది. అభినయ్ చెంపలు పగలగొడుతుంటే నేను అడ్డువెళ్లి ఆపాను. వనజ అరుపులకు నిద్రకళ్లతో వచ్చిన శివ విషయం అర్థంకాక కంగారుపడ్డాడు.

''నేను అనుకుంటూనే ఉన్నాను. ఇలాంటిది ఏదో  జరుగుతుందని.  ఎన్నోసార్లు మీకు చెబుతూనే ఉన్నాను. మీ అమ్మ వాణ్ణి చెడగొడుతోందని... వింటేగా? అనుభవించండి. వేలకు వేలు పోసి డొనేషన్లను కట్టింది పద్యాలు పాడటానికి, నాటకాలు వేయడానికా? వాడి మార్కులు చూడండి...

''ఇప్పటికే అందరికీ తెలిసిపోయింది, మీ అమ్మ డ్రామా ఆర్టిస్టని. పదిమందిలో పరువుపోతోంది. నిప్పులాంటి కుటుంబం మాది. నిన్ను పెళ్లి చేసుకునే ముందు కూడా మీ వంశం గురించి చెప్పలేదు నువ్వు. నాటకాల వాళ్లని తెలిసి మావాళ్లంతా నివ్వెరపోయారు.

''సిగ్గులేకుండా స్టేజీలెక్కి తైతక్కలాడి ఇప్పుడు అభినయ్‌ని చెడగొడుతోంది. తనలాగే నాటకాలు వేసుకుని బతికేలా చేసేట్టుంది. వాడి చదువంతా తుంగలో తొక్కుతోంది... ఇదంతా నా ఖర్మ.''

శివకు విషయం అర్థమయ్యేసరికి  నాకేసి తీక్షణంగా చూశాడు.

''ఎందుకమ్మా మనం నాటకాల వాళ్లమని పది మందికి తెలియాలా? ఎందుకు వాణ్ణి చెడగొట్టడం?

పనికిమాలిన న్యూసెన్స్ ఉదయాన్నే,'' చిరాగ్గా తన గది లోకి వెళ్లిపోయాడు. శివ చూపుల్ని తట్టుకోలేకపోయాను. నేనేదో కాని పని చేసినట్టు చూశాడు.

వాణ్ణి నేను చెడగొట్టడం ఏమిటీ? వాడు గొప్ప చదువులు చదివి మంచి హోదాలోకి రావాలని నేను మాత్రం కోరుకోనా? నా సాంత్వన కోసం, వాడి సరదా కోసం పద్యాలు పాడుకోవడం తప్పా? ఇదొక్కసారి మార్కులు తక్కువొస్తే ఇక వాడు చదవడనా!

శివ మాటలకి సిగ్గుతో చితికిపోయి, దోషిలా నిల బడ్డాను.

ఎదలోంచి తన్నుకొచ్చే దుఃఖాన్ని ఆపలేక పోయాను.

''నాటకాల ఏడుపుల్ని ఆపండి. వాడు ఏమాత్ర మన్నా చదువుకుని బాగుపడాలంటే వాడితో మాట్లాడ కండి. మీ భయానికి వాణ్ణి ఏ హాస్టల్‌లోనో వేయక తప్పేట్టు లేదు. ఇంట్లో ఎవరో ఒక్కరే ఉంటేగాని వాడు బాగుపడలేడు. నేను చెప్పేది చెప్పాను. ఆపై మీ ఇష్టం. మర్యాదగలవారైతే రెండోసారి చెప్పించుకోరను కుంటా...''

ఏమిటి వనజ నన్ను వెళ్లిపొమ్మంటోందా?

ఎక్కడికెళ్లాలి?

మెదడు పనిచేయలేదు. నాకు నాన్న నుంచి సంక్రమించిన విజయనగరంలోని ఇల్లు అమ్మేసి అదే డబ్బుతో మరో ఇల్లు ఈ ఊర్లో కట్టేదాకా శివ తనను నిలవనీయలేదు. తాతలనాటి పాడుబడ్డ ఇల్లు ఎందు కంటూ దాన్ని అమ్మించేదాకా వదల్లేదు.

కాలక్రమంలో స్తబ్దత చోటు చేసుకున్న ఆ ఇల్లు ఒకప్పుడు ఎలా ఉండేది?

ఏ గోడ మీటినా సప్తస్వరాలు పలికేవి.

ఘల్లుఘల్లుమనే మువ్వల శబ్దతరంగాలు లయ బద్ధంగా గదుల నిండా విస్తరించేవి.

హార్మోణియం...తబలా... సారంగి... మృదంగం... ఎన్ని రకాల వాయిద్యాల సమ్మేళన రవళి...

చెల్లియో... చెల్లకో...

జెండాపై కపిరాజు...ఏదో ఒకమూల పద్య విన్యాసాల రిహార్సళ్లు...

తెరలు... వస్త్రాలు... అస్త్రాలు... కిరీటాలు... గదలు... సింహాసనాలు...

చెవుల్లో నటరాజు తాండవమాడుతున్న సవ్వడి...

రంగస్థల నటుల అభినయాలు, వాళ్లలో వాళ్ల అభినందనల పరంపరలు, ప్రేమలు, ఆత్మీయాలింగ నాలు... కలిసికట్టుగా పనిచేసే ఐక్యత... ఎంత సందడిగా ఉండేది!

ఇప్పుడెక్కడికి వెళ్లాలి? నా స్వంత ఆస్తంటూ ఇప్పుడింకేం మిగిలింది? కనీసం చిన్న గుడిసైనా లేదే!

వనజ మాటల తూటాలు ఎక్కడ తగలాలో అక్కడే తగిలాయి నాకు. శివ అంతరంగంలో ఏముందో ఇందాకనే తెలిసిపోయింది.

భగవాన్ ఇది పరీక్షా సమయమా?

భూమి రెండుగా చీలిపోయి నేనందులోకి కూరుకుపోతే బాగుండేది. నెమ్మదిగా కదిలి నా గదిలోకి వెళ్లాను. అభినయ్‌ని తీసుకొని స్కూల్‌కి వెళ్లింది వనజ.

ఇంకా వాళ్ల మధ్యన ఉండటమా?

ఏం చేయాలో ఆలోచించుకున్నాను. కొడుకూ కోడలూ ఏదో అన్నారని చనిపోయేంత బేలనయితే కాను. జీవితంలో ఎన్ని ఒడిదుడుకుల్ని ఎదుర్కోలేదు?

గౌరవం లేనిచోట ఉండేకన్నా నా కళాజీవితాన్ని నెమరేసుకుంటూ, నన్ను మనిషిగా చూసే వాళ్ల మధ్య బతుకుని ముగించడంలోనే తృప్తి...

వెంటనే దేవదానం అన్నయ్యకు ఫోన్ చేశాను. అతనికి విషయం ఏమీ చెప్పకుండా, 'మిమ్మల్ని చూడా లనిపిస్తోంది. బయల్దేరుతున్నా'నని చెప్పాను.

వనజ వెళ్లిన కొద్దిసేపటికే శివ వెళ్లిపోయాడు. తప్పు నాదేనన్నట్టు చూశాడే కానీ మాట్లాడలేదు.

మనసు చివుక్కుమంది.

అలాంటివాడ్ని కన్నందుకు నాపై నాకే అసహ్యం వేసింది.

*

పాసింజర్ రైలు పెద్దగా కూత పెడ్తూ వచ్చి ఆగింది. పాసింజర్ల హడావుడికి నవ్వొస్తోంది.

'జీవితంలో ఎంత పరుగులు తీసినా చివరకు ఆగిపోయిన గడియారం లోలకంలా నిశ్చలమైపోవల సిందే,' అనిపించింది.

వెనకనుండి నా భుజంపై ఆప్యాయంగా ఓ చేతి స్పర్శ.

''వసుంధరా...'' దేవదానాన్ని చూడగానే దుఃఖం ఆగలేదు నాకు. అతని చేతిని నా రెండు చేతుల్లోకి తీసు కొని గట్టిగా పట్టుకున్నాను. నా వాళ్లమధ్యకు వచ్చేసిన ధైర్యం కలిగింది.

లిప్తకాలంలోనే నా రాకలోని అంతరార్థం గ్రహిం చాడు దేవదానం.

తనేం మాట్లాడకుండా నా బేగ్‌ను ఒక చేతిలోకి తీసుకుని, మరో చేత్తో నా భుజాన్ని పొదివి పట్టుకుని గేటువైపు అడుగులేశాడు.

*

శివ దగ్గర్నుండి వచ్చేసి ఆరునెలల పైనే అయ్యింది. అప్పుడప్పుడు అభినయ్ గుర్తుకు వస్తున్నాడు. వాడికి దూరం అవుతున్నానన్న బాధ. అంతలోనే శివ, వనజల ప్రవర్తన గుర్తొచ్చి అక్కడ ఉండకపోవడమే మంచిదనుకునేదాన్ని.

శివ నాకోసం వెతికుంటాడా? కనీసం పేపర్లో అయినా వేయలేదే? ఆ ఆలోచనే నాకు నవ్వు తెప్పించింది. నా ఆలోచనే తప్పు.

ఒక రకంగా నేను ఇంట్లోంచి వెళ్లిపోవడమే వాళ్లకు కావలసింది.

దేవదానం ఊహించని విషయాన్ని చెప్పాడు ఆవేళ.

'నాటక మహోత్సవాలు జరుపుతూ ఒక ఎన్‌ఆర్‌ఐ సంస్థ నాటకాల్లో కృషి చేసిన వాళ్లకు లైఫ్‌టైం అఛీవ్‌మెంట్ కింద లక్ష రూపాయల్ని ఈ సంవత్సరం నాకు ఇవ్వబోతున్నట్టు ప్రకటించిందని.'

'నాటకాన్ని బతికించాలనుకునేవాళ్లు ఇంకా ఉన్నారా!' ఆశ్చర్యపోయాను. రాగమయి ఈ ఆనందంలో పాలుపంచుకుంది. పేపర్లలో టీవీల్లో వచ్చిన ఈ వార్త శివ దృష్టికీ వెళ్లిందనడానికి ఆరోజు పేపర్లో వచ్చిన ప్రకటనే సాక్షి. ఆ ప్రకటనను దేవదానం చదివి వినిపించాడు.

"అమ్మా! నీవు ఇల్లు వదిలేసి వెళ్లినప్పటి నుండి నీ మనవడు బెంగతో ఉన్నాడు. వాడి కోసమైనా నీవు తిరిగి రావలసింది." - ఇట్లు, శివ.

నాకు నవ్వొచ్చింది. ఆ ప్రకటనలోని అంతరార్థం నేను మాత్రమే అర్థం చేసుకోగలను. ఇప్పుడు నేను శివ దగ్గరికి వెళ్లకపోయినా పురస్కారం అందుకునే రోజు అక్కడికి వస్తాడని, నన్ను రమ్మని బలవంతపెడతాడనీ నాకు తెలుసు.

దేవదానం కేసి చూశాను. 'నీ యిష్టం' అన్నట్లున్నాయి అతని చూపులు. అవసరాలు మనుషులకు బంధాలను గుర్తుకు తెస్తాయని నాకు తెలుసు!

మనవడంటే నాకు ఇష్టమే. వాడి సహచర్యంలో నన్ను నేను మైమరచి అలౌకికమైన ఆనందం పొందటం కూడా నిజమే! అయితే నా అభిమానాన్ని చంపుకొని వాళ్ల మధ్యన ఉండలేను. ఇన్నాళ్లూ చచ్చానో బతికానో తెలుసుకోడానికి ప్రయత్నించని శివ... ఇప్పుడిలా ప్రకటించడం వెనక...!?

దేవదానానికి నా నిర్ణయం పట్ల పూర్తి విశ్వాసం.

రాగమయి చేతిని నా చేతిలోకి తీసుకుంటూ చిన్న పిల్లలా అన్నాను.

"నేనెప్పుడూ ఇక్కడే ఉండిపోవచ్చా..." నా మాట పూర్తికాకుండానే తన అరచేత్తో నా నోరు మూసేస్తూ గుండెలకు హత్తుకుంది.

అది అమ్మ స్పర్శ. గుండె చెమ్మగిల్లుతుండగా రాగమయిని నాలోకి మరింతగా పొదువుకున్నాను.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 17 డిసెంబర్ 2006*

